రిజిస్ట్రేషన్లకు సర్వం సిద్ధం

- హౌస్ కమిటీ భూముల దరఖాస్తులపై విచారణ పూర్తి
- మొదటి దశలో 6,800 మందికి రిజిస్ట్రేషన్లు



లబ్ధిదారు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న రెవెన్యూ ఉద్యోగి

గాజువాక : గాజువాకలో మూడు దశాబ్దాలుగా నలుగుతున్న హౌస్ కమిటీ సమస్యకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కృషితో పరిష్కారం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో షరతులతో కూడిన పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ (కన్వేయన్స్) డీడ్‌లను ఇచ్చి తమ ఆస్తిపై అన్ని హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు గాజువాక మండల రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీనికి సంబంధించి అందిన దరఖాస్తులపై ఇప్పటికే విచారణను కూడా పూర్తి చేశారు. దీంతో రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం అయింది.

నామమాత్రంగా రిజిస్ట్రేషన్ చార్జీలు

రిజిస్ట్రేషన్ చార్జీలు ఎంత చెల్లించాలన్న దానిపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. వంద చదరపు గజాల లోపు స్థలంలో పట్టా కలిగి ఉన్న వారికి కేవలం రూ.500 ప్రాసెసింగ్ ఫీజు తీసుకొని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజును పూర్తిగా మినహాయించారు. 101 చదరపు గజాలనుంచి ఎంత విస్తీర్ణం కలిగి ఉన్నా, దరఖాస్తుదారుడు పట్టా కోసం చెల్లించిన మొత్తం ఫీజుపై 7.5 శాతం డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది.

ఉదాహరణకు ఒక వ్యక్తి తన 200 చదరపు గజాల స్థలానికి పట్టా కోసం రూ.75వేలు చెల్లిస్తే కన్వేయన్స్ డీడ్ కోసం ఆ వ్యక్తి 7.5 శాతం డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. అనగా రిజిస్ట్రేషన్ చలానా కోసం రూ.5,625, ప్రాసెసింగ్ ఫీజు రూ.500 కలిపి మొత్తం రూ.6,125 చెల్లిస్తే సరిపోతుంది. మార్కెట్ విలువపై స్టాంప్ డ్యూటీ చెల్లించాలన్న ప్రచారంలో నిజం లేదని మండల రెవెన్యూ అధికారులు తెలిపారు.

రిజిస్ట్రేషన్‌లు ఎక్కడెక్కడంటే.. : హౌస్ కమిటీతో పాటు జీవో 388 ప్రకారం పట్టాలు పొందినవారు ఒకేచోట రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వారి కోసం నగరంలోని ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గాజువాక, పెదగంట్యాడ, లంకెలపాలెం, పెందుర్తి, గోపాలపట్నం, ద్వారకానగర్, విశాఖపట్నం ఆర్వోల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోను ఈ రిజిస్ట్రేషన్ల కోసం వీఆర్వోలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

6,800 మంది లబ్ధిదారులు

గాజువాక హౌస్ కమిటీకి సంబంధించిన జీవో 301 ప్రకారం మొత్తం పట్టాలు పొందినవారు 7026 మంది కాగా, వారిలో ప్రస్తుతం ఆరు వేల మందికి కన్వేయన్స్ డీడ్‌లను ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేసి జీవో 388 ప్రకారం పట్టాలు పొందిన 945 మందిలో తొలుత 800 మందికి కన్వేయన్స్ డీడ్‌లను ఇవ్వాలని నిర్ణయించినట్టు గాజువాక తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు.

ఈ పత్రాలు అవసరం

రిజిస్ట్రేషన్ల కోసం లబ్ధిదారులు తమ ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోలు రెండు, పాన్ కార్డును సమర్పించాల్సి ఉంటుంది. పాన్ కార్డు లేనిపక్షంలో ఫారం 60, లేదా అధికారులు సూచించిన ప్రత్యేక ఫారం గానీ సమర్పించాల్సి ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

వారికి రెండోదశలో అవకాశం

గత ప్రభుత్వ హయాంలో క్రమబద్ధీకరణ కోసం భూబాధితులు ప్రభుత్వం నిర్దేశించిన మొత్తానికి చలానాలను చెల్లించినా పట్టాలను జారీ చేయలేదు. పట్టాలు పొందేందుకు అర్హతలున్నప్పటికీ సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉంచారు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుత ప్రభుత్వం వారికి కూడా న్యాయం చేయాలని నిర్ణయించి జీవో 60ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గతంలో చలానాలను చెల్లించి పట్టాలు పొందనివారికి రెండో దశలో కన్వేయన్స్ డీడ్‌లను ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు.

అన్ని ఏర్పాట్లు చేశాం

లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్ (రిజిస్ట్రేషన్)లు చేయించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎక్కడా పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. రెండు మూడు రోజుల్లో రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఫార్మాట్‌లు వస్తాయి. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం.

– పాల్ కిరణ్, గాజువాక తహసీల్దార్

క్లుప్తంగా

వంగవీటి రంగాకు నివాళి



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు

గాజువాక: పేదవర్గాల హక్కులను సాధించాలన్న దివంగత వంగవీటి రంగా ఆశయ సాధనకు పునరంకితం కావాలని శ్రీకృష్ణ దేవరాయ గాజువాక కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు కోరారు. రంగా జయంతిని పురస్కరించుకుని స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తలారి వెంకట రమణ, కరణం బాబూరావు, నగిరెడ్డి అప్పలనాయుడు, తాటికొండ కన్నారావు, శనివాడ హరిబాబు, సియ్యాద్రి అప్పారావు, కొత్తపల్లి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడి దృష్టికి భెల్ ఉద్యోగుల సమస్యలు



సుభాష్ పార్థీకి వినతిపత్రం అందిస్తున్న భెల్ జై భీమ్ వర్గం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (జై భీమ్) వర్గం ప్రతినిధులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు సుభాష్ పార్థిని మంగళవారం కలిశారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పార్థిని కలిసి, సంస్థలో ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో హెచ్‌పీవీపీ యూనిట్‌కు విచ్చేసి యాజమాన్యంతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సునీల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ కె.ఎన్.పి.చక్రవర్తి, భెల్ జై భీమ్ వర్గం ఎస్సీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు టి.రవి కిషోర్, రాము, హెచ్.భోగేష్ తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి ప్లై ఓవర్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు



చెక్ పోస్టు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ

అగనంపూడి: నిషేధిత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు హోమీ బాబా క్యాన్సర్‌ఆస్పత్రి కూడలి వద్ద దువ్వాడ పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా, గుట్కా, ఖైనీ వంటి నిషేధిత మత్తు పదార్థాలపై దృష్టి సారించామని దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. చెక్‌పోస్టు సిబ్బంది ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ చార్జీలు పెంచితే కార్మికులపై మరింత భారం



ధర్నా చేస్తున్న నాయకులు

ఉక్కునగరం: టౌన్‌షిప్ క్వార్టర్లలో నివసిస్తున్న కార్మికుల విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదన విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో ఉక్కు టౌన్ అడ్మిన్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్లాంట్ నష్టాల పేరిట ఉక్కునగరం క్వార్టర్లకు కనీస నిర్వహణ కూడా చేయించకపోవడంతో కార్మికులే సొంత ఖర్చులతో చేయించుకుంటున్నారన్నారు. వేతన సవరణ చేయక కార్మికులు ఇప్పటికే ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ చార్జీల పెంపు వల్ల మరిన్ని సమస్యలు పెరుగుతాయన్నారు. అనంతరం డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన



మహిళకు కళ్లజోడు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: 'మన ఐ కేర్' సామాన్య ప్రజలకు చేస్తున్న కంటి వైద్య సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 69వ వార్డు షీలానగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో మన ఐ కేర్ (ప్రైమరీ ఐ కేర్ సర్వీస్) ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 80మందికి కంటి పరీక్షలు చేశారు. కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతుల మీదుగా కళ్ల జోళ్లు అందజేశారు. అభయాంజనేయ స్వామి ఆలయ ధర్మకర్త గుళ్లపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు, కంటి వైద్య నిపుణులు మల్లేపూడి వినయ్ దినకర్, నేలపాటి సౌమ్య, వైఎస్సార్ సీపీ మహిళా కార్యదర్శి నేలపాటి సత్యవతి, ప్రసన్న వేంకటేశ్వరాలయం పాలక మండలి చైర్మన్ గంరెడ్డి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం



87వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. వార్డులోని వడ్లపూడి-1,2,3 సచివాలయాల పరిధిలోని వార్డు కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఎటువంటి సర్వీస్ చార్జి లేకుండా ఉచితంగా అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి 6 రోజుల పాటు కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు వారి క్లస్టర్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను నమోదు చేసుకుని వారికి టోకెన్ ఇస్తారన్నారు. వలంటీర్లు ఇచ్చిన టోకెన్ తీసుకుని 12వ తేదీన జరగనున్న జగనన్న సురక్ష క్యాంపులో అధికారులు సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సచివాలయ పరిధిలో ఉన్న అర్హులందరికీ వలంటీర్లు జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశాన్ని వివరించి, వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాలను తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, చిత్రాడ వెంకటరమణ, వడ్లపూడి ఈశ్వరరావు, కోమటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

గనుల లీజుల పునరుద్ధరణకు వినతి



మంత్రి అమరనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, సీపీఎం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్రంలో కేటాయించిన గనుల లీజులు పునరుద్ధరించి, వాటి గడువు పెంచేందుకు కృషి చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మంత్రి గుడివాడ అమరనాథ్‌ను కోరారు. ఈ మేరకు నాయకులు మంత్రిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విజయనగరం జిల్లాలోని గర్భాం మైన్స్ ద్వారా మాంగనీసు, సరిపల్లి ఇసుక రీచ్ నుంచి ఇసుకను నాటి రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించిందన్నారు. వాటి లీజుల గడువు ముగిసినందున పునరుద్ధరించాలని కోరారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఈ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారని గంగారావు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.శ్రీనివాసరాజు, వై.టి.దాస్, యు. రామస్వామి, చిరంజీవి, మరిడయ్య తదితరులు పాల్గొన్నారు

నవ్య ఆలోచనలే ఆవిష్కరణలకు నాంది



చైన్‌లెస్ సైకిల్‌ను ప్రదర్శిస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు

అగనంపూడి: నవ్య ఆలోచనలే నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన మెకానికల్ విభాగ విద్యార్థులు 50 ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. ఆ మోడళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలన్నారు. ప్రతీ అంశాన్ని లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, విభాగం హెడ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను కాపాడుకుంటేనే భవిష్యత్తు



శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 873వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షల్లో సంస్థకు చెందిన టీపీపీ, ఆర్‌ఈడీ, పస్టెం, స్టోర్స్, ఎస్ఎండీ తదితర విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి



లక్ష్మీపురంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగిరెడ్డి, ఇతర నాయకులు



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నిర్వాసిత నాయకులు

కూర్మన్నపాలెం: సాయుధ పోరాటంతో బ్రిటిష్ వారిని గడగడలాడించిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. అడవి తల్లి బిడ్డగా, గిరిజనుల ఆత్మగౌరవం కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప వీరుడని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి సందర్భంగా 87వ వార్డు లక్ష్మీపురంలో క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అల్లూరి పార్కులోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక మాజీ మున్సిపల్ చైర్మన్ వి.వి.ఎస్.ఎం.రాజా, 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ఎన్నేటి రమణ, కల్లెపల్లి శ్రీనివాస్‌వర్మ, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు మరువలేం

పెదగంట్యాడ: విప్లవజ్యోతి, మన్యం దొర అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేమని ఉక్కు నిర్వాసిత సంఘం నాయకుడు పులి వెంకట రమణారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలను అర్పించిన అల్లూరిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్లు, నిర్వాసిత నాయకులు పాల్గొన్నారు.

- సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో అల్లూరి 126వ జయంతి వేడుకలు పెదగంట్యాడ పోతిన సన్యాసరావు భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎల్లేటి శ్రీనివాసరావు, పల్లేటి పోలయ్య, ఆనంద్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: అల్లూరి సీతారామరాజు జయంతిని అగనంపూడి సత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో నెల్లి తులసి, ముత్యాల అప్పారావు, గోపిశెట్టి సత్యారావు, లక్కరాజు రాంబాబు, అప్పారావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: అల్లూరి జయంతిని స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించారు. సెక్టార్-6లోని అల్లూరి కూడలి వద్ద అల్లూరి విగ్రహానికి బీజేపీ గాజువాక కన్వీనర్ కరణం రెడ్డి నర్సింగరావు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శంకరరావు, రమణ, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో రక్తపరీక్షలు ప్రారంభం



స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేయించుకుంటున్న పిట్టా రెడ్డి

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రిలో రక్తపరీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఈ ఆస్పత్రిలో గతంలో రక్తపరీక్షలు నిర్వహించకపోవడంతో వైఎస్సార్‌టీయూసీ నాయకులు దీనిపై పోరాటాలు సాగించారు. స్పందించిన అధికారులు ఇక్కడ రక్తపరీక్షలకు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేశారు. దీంతో మంగళవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రిలో ఎక్స్ రే, ఈసీజీ, స్కానింగ్, ఈఎస్‌టీ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను మరో ఆస్పత్రికి ఇక్కడి నుంచే రిఫర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొందేశి అప్పలరెడ్డి, వాసా అప్పలరెడ్డి, పెద్దాడ కనకరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకుల వల్లే స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావం



సమావేశంలో ప్రసంగిస్తున్న మస్తానప్ప

ఉక్కునగరం: నాటి నిస్వార్థ రాజకీయ నాయకుల వల్లే విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఆవిర్భవించిందని స్టీల్ వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై. మస్తానప్ప అన్నారు. దేశంలోని 5వ ప్రతిపాదిత ఉక్కు కర్మాగారం విశాఖలో నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి 58 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చిన నేపథ్యంలో అప్పటికే మద్రాసు నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయాలని నాటి నాయకులు సంకల్పించారన్నారు. 1965 జూలైలో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేయించారన్నారు. అటువంటి ప్లాంట్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, కర్రి దాలినాయుడు, మార్టుపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



వంతెన పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సూర్యకుమారి

పెదగంట్యాడ: వంతెన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి సూచించారు. రూ.40 లక్షలతో అప్పికొండ గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న వంతెన పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ వంతెన లేకపోవడంతో అప్పికొండ గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారన్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నిధులు మంజూరు చేయించామని, ఇప్పుడు ఆ పనులు త్వరితగతిన సాగుతున్నాయని తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లో పాము కలకలం



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనంలో పాము కలకలం సృష్టించింది. మంగళవారం ఉదయం యథావిధిగా విధులకు హాజరైన ఉద్యోగులు అక్కడ పాము తిరగడం చూసి భయంతో పరుగులు తీశారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. అతడు మూల ఉన్న ఐదడుగుల పామును పట్టుకోవడంతో, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. పామును అటవీ శాఖకు అప్పగిస్తానని కిరణ్‌కుమార్ తెలిపారు.

కమ్యూనిటీ హాలు స్థల సేకరణకు సర్వే



రాంనగర్‌లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లో మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాలు కోసం గాజువాక రెవెన్యూ అధికారులు, సచివాలయ వీఆర్వోలు, ప్రైవేట్ డిజిటల్ సిబ్బంది మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే నాగిరెడ్డిని కోరారు. దీనిపై గాజువాక తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో అధికారులు స్థల సేకరణకు సర్వే నిర్వహించారు. సర్వే పూర్తి వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని గాజువాక రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

వియత్నాం కార్మిక సదస్సుకు బోసుబాబు



బోసుబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ పూర్వ అధ్యక్షుడు, సీపీఐ సీనియర్ నాయకుడు జి. బోసుబాబు వియత్నాం కార్మిక సదస్సుకు హాజరవుతున్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోపరేషన్ (ఇస్కఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 15 వరకు సదస్సు జరగనుంది. ఈ సదస్సులో కార్మికుల సమస్యలు, వాటి పరిష్కారాల గురించి చర్చించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని లేవనెత్తుతామని బోసుబాబు తెలిపారు.

అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: పేదలకు కుల, మత,రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 74వ వార్డు వియ్యపువానిపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలిశారు. నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వియ్యపు కిశోర్, కోన వెంకట అప్పారావు, వియ్యపు మహేష్, గళ్లా శంకర్‌సాయిరాం, దల్లి పైడికొండ, వియ్యపు అప్పలనాయుడు, కొండబాబు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ చెప్పారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక మండలం శ్రీహరిపురానికి చెందిన దాడి సూరిబాబు ఈ నెల 2న పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో జరిగిన పండగకు బంధువుల ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి తన స్వగృహానికి తిరిగి వెళ్తుండగా కొప్పాక బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతుడి కుమారుడు జీవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.